క్లుప్తంగా

నియామకం

కల్వకుర్తిరూరల్: తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులుగా తమ వంతు పాత్ర పోషించిన పట్టణానికి చెందిన విజయ్‌గౌడ్, వంగూరు మండలం కోనాపూర్‌కు చెందిన రాజేందర్‌రెడ్డికి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌గా నియామకం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 121ని శనివారం విడుదల చేసింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కల్వకుర్తిరూరల్: ఈనెల 20న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులందరూ సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

కందనూలు: నాగం దినకర్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20న జిల్లా కేంద్రంలోని ప్రజా నర్సింగ్ హోంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ నాగం శశిధర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా నర్సింగ్ హోంలో నిర్వహించే వైద్య శిబిరంలో వెరికోస్ వేయిన్ రీస్ ఉన్నవారికి సుమారు రూ.3,500 విలువగల స్కానింగ్‌ను ఉచితంగా చేయనున్నట్లు వివరించారు. ఈ వైద్య పరీక్షలను ప్రసూతి స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ మీరానాగం, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ హేమా శిరీష, జనరల్ ల్యాపరో స్కోపిక్ సర్జన్ డాక్టర్ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 నుంచి 4 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 94920 44372, 88850 83333 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

అచ్చంపేట రూరల్: పట్టణంలోని టంగాపూర్ కాలనీలో భీమలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెద్దదర్గా ఉర్సు వాయిదా

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్‌లో కృష్ణానదిలో ఆరు నెలలు, కృష్ణాతీరాన ఆరు నెలలు ఉంటున్న ఆదిహజరత్ సయ్యద్‌ఖాద్రి పెద్ద దర్గా ఉర్సు ఉత్సవాలు ఫిబ్రవరి 19న జరగాల్సింది. అయితే ఈ ఉత్సవాల సమయంలో వర్షం పడడంతో ఎక్కువగా బురదమయం కావడంతో వచ్చేనెల 30న నిర్వహించేందుకు సర్పంచ్ ఎస్‌కె ఖాజా, దర్గా కమిటీ శనివారం వాయిదా వేయాలని నిర్ణయించింది. కార్యక్రమంలో నూర్‌పాషా, సయ్యద్ పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో సీసీరోడ్డు పనులు

చారకొండ: గ్రామంలో రూ.40 లక్షల నిధులతో సీసీ రోడ్లు పూర్తి చేస్తామని మండల కోఆప్షన్ సభ్యులు షేక్ సలీం, తుర్కలపల్లి సర్పంచ్ లక్ష్మమ్మ అన్నారు. మండలంలోని తుర్కలపల్లిలో శనివారం సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంకొండ, రమేష్, వెంకటయ్య ఉన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో శనివారం సీసీరోడ్డు పనులను సర్పంచ్ భూపతిరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల నిధులతో సీసీరోడ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు చందునాయక్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం

మన్ననూర్: అమ్రాబాద్ మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని నాయకులతో కలిసి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికలకు సంబంధించి దిశ నిర్దేశాలను వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, నాయకులు చెన్నకేశవులు, రాజారాం, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి

కల్వకుర్తిరూరల్: యువత స్వయం ఉపాధితో అభివృద్ధిలోకి రావాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని జేపీనగర్‌లో టీ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు.

బ్యాంకు సేవలపై కళాజాతా

కోడేరు: బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ ధర్మతేజ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బస్టాండ్‌లో బ్యాంకు సేవలపై కళాజాతా బృందం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్యాషియర్ వినోద్, శ్రీను, కళాజాత బృందం సభ్యులు విజయ్, చిరంజీవి పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



లింగాల మండలం అంబటిపల్లి పాఠశాలలో సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

కందనూలు: జిల్లావ్యాప్తంగా శనివారం అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు విశేష స్పందన లభించిందని డీఈఓ గోవిందరాజులు తెలిపారు. జిల్లాలోని 825 పాఠశాలలకుగాను 740 పాఠశాలల్లో జరిగిన సమావేశాలకు ఒకటి నుంచి 10వ తరగతి వరకు 38,556 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. సమావేశాల నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు.

తెలకపల్లి: విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపీపీ కొమ్ము మధు అన్నారు. శనివారం మండల పరిధిలోని గడ్డంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ మేరకు పాఠశాల మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీతో పాటు ఎంఈఓ చంద్రుడు, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగాల: పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయులు తాహెర్‌పాష, అరవింద్ కోరారు. శనివారం మండల పరిధిలోని లింగాల, అంబట్‌పల్లి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో తమ పిల్లలను ఇంటి వద్ద చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వెల్దండ: విద్యార్థులను పాఠశాలకు ప్రతి రోజు క్రమం తప్పకుండా పంపించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు బొల్లంపల్లి తదితర పాఠశాలలో సమావేశం నిర్వహించారు.

ఉప్పునుంతల: మను ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ వివరించారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, విద్యార్థుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఉపాధ్యాయులు బాలమణి, వెంకటేష్ పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్‌లో దోసకాయలపేటలో సీపీఎస్ పాఠశాలలో డీఈఓ గోవిందరాజుల ఆదేశానుసారం విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులను ప్రతి రోజు పాఠశాలకు పంపాలన్నారు. అదేవిధంగా ఇంట్లోనే చదివించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత, గోపాల్ పాల్గొన్నారు.

తాడూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపే విధంగా తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆయా పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఆయా పాఠశాలలను సందర్శించిన ఆయన ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. బడీడు పిల్లలు బడిలోనే ఉండేవిధంగా చూడాలన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ



వినికిడి యంత్రాలు అందుకున్న వారితో డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్

కొల్లాపూర్: పట్టణం సమీపంలోని ఆరోగ్య మాత రూరల్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో 43 మంది పిల్లలకు వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. నిర్మలదాసి సేవాసంస్థ, చాయ్–వీ గార్డ్ సహకారంతో యంత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి లోపం ఉన్నవారు చిన్న వయస్సు నుంచే తగిన చికిత్సలు తీసుకుంటే వినికిడి సమస్యలు తొలిగిపోయే అవకాశాలు ఉంటాయన్నారు. వినికిడి యంత్రాలు అందించిన సేవాసంస్థలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సోమశేఖర్, రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, సూపర్‌వైజర్ శోభారాణి, ఆరోగ్యమాత కేంద్రం సిస్టర్లు లూసీ, నెల్లిస్సెరీ, రోసిలి, శాంటీ తదితరులున్నారు.

'చలో ఢిల్లీ' పోస్టర్ విడుదల

కల్వకుర్తిరూరల్: వ్యవసాయ కార్మిక, రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. శనివారం పట్టణంలోని పౌరసరఫరాల గోదాం వద్ద హమాలీ కార్మికులతో కలిసి ఆయన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మల్లయ్య, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాసులు, కుర్మయ్య, యాదయ్య, భీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



కంటిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తెలకపల్లి: కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని డాక్టర్ దీపిక అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రం అనుబంధ సంస్థ కూచుకుళ్ల రాంచంద్రారెడ్డి నేత్ర వైద్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్లకోమా వ్యాధి కంటిలో ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో ఈ వ్యాధి చిన్న పిల్లల్లో ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు ప్రతి ఆరు నెలలకు ఒక సారి కంటి పరీక్షలు చేయించుకొని కంటిలో గ్లకోమా రాకుండా కాపాడుకోవచ్చన్నారు. కంటిలో గాయాలతో ఎక్కువగా స్టిరైడ్ తీసుకోవడంతో గ్లకోమా ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని అన్నారు. అంతకు ముందు భారీ ఎత్తున పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రం డాక్టర్ దీపికతో పాటు ప్రధానోపాధ్యాయుడు బాలస్వామి, అడ్మినిస్టేటర్ దేవిచందర్‌రావు, కోఆర్డినేటర్ కె రాజు, వెంకటేశ్, ఆంజనేయులు, ఉపాధ్యాయులు ఆనంద్, ప్రభాకర్ విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

తెలకపల్లి: గురుకుల పాఠశాలలో చదివేందుకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలత శనివారం తెలిపారు. మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం వీటీడీ సెట్2023కు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 20వ తేది చివరి అవకాశం అన్నారు. దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం కోసం ఈ ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23న ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బిజినేపల్లి: మండల కేంద్రంలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తుకు మార్చి 20వ తేదీ అని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి



సమావేశానికి హాజరైన అధికారులు

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జన్ ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రజలకు వైద్య సేవలను అందుబాటులో ఉండే విధంగా సలహాలు, సూచనలు అందించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల స్థాయిలో ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీఓ, సర్పంచ్, ఏపీఎం తదితర వాటితో నూతన కమిటీ ఎన్నుకోవాలన్నారు. అదే విధంగా మండలంలో 5ఉప ఆరోగ్య కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూప, సర్పంచ్ భూపతి రెడ్డి, వైస్‌ఎంపీపీ శాంతి, ఏఐఎస్ చైర్మన్ భారతమ్మ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీను, సూపరింటెండెంట్ మోహన్‌లాల్, ఏపీఎం రాములునాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల అందజేత



కందనూలు: మండల పరిధిలోని గగ్గలపల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. వాసవీ వనిత క్లబ్ అధ్యక్షుడు చిగులపల్లి జ్యోతి రమణ కుమార్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ రాష్ట్ర కార్యదర్శి కల్మిచర్ల రమేశ్, డివిజన్ అధ్యక్షులు రాఘవేందర్, శ్రీనివాసులు, రాజేందర్, కిషన్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మాదిగల సంగ్రామ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న నాయకులు

ఊర్కొండ: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా మహాజన నేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహించిన పాదయాత్ర మండలంలో శనివారం 2వ రోజు కొనసాగింది. పాదయాత్రలో భాగంగా ఉమ్మ జిల్లా ఎంఎస్పీ ఇన్‌చార్జి టైగర్ జంగయ్య, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పోతుగంటి కృష్ణలు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయకుండా కాలయాపన చేస్తుందని దుయ్యబట్టారు. మాదిగల పల్లెలకు బీజేపీ నాయకులు ప్రచారానికి వస్తే అడ్డుకొని తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధార రాధకృష్ణ, సీనియర్ నాయకులు వీరస్వామి, దార బంగారయ్య, సురేష్, జగన్, రాములు, రమేష్, నాగర్జున, పరమేష్, శివకృష్ణ, బంగారు, శివకుమార్, కిరణ్, పూలే రాములు, మల్లేష్, యాదయ్య, రాములు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాసులు

వెల్దండ: గ్రామాల్లో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దాపూర్, రాచూర్, కొట్ర తదితర గ్రామాల్లో సైబర్ నేరాలపై గ్రామస్తులకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానంతో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవ్వరికి ఓటీపీ, ఆధార్, బ్యాంక్ వివరాలను ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది తదితరులు ఉన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న రామయ్య

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా జనరల్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బందికి కనీస వేతనాలు అమలు చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ జిల్లా కన్వీనర్ పాదిల రామయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ పోరాటాల ఫలితంగా సాధించుకున్న జీఓల ప్రకారం వేతనాలు చెల్లించకుండా కార్మికులను శ్రమదోపిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, కార్మికులు సాయమ్మ, అన్నపూర్ణ, రేణుక, రామేశ్వరమ్మ, మహేశ్వరి, చంద్రకళ, శ్వేత, మణెమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను సరి చేశారు

సాక్షి ఎఫెక్ట్..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఓ వార్డులో తేలిన్న విద్యుత్ తీగలను శనివారం సరి చేశారు. ఈనెల 17న శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'విద్యుత్ తీగలను సరి చేయండి' వచ్చిన వార్తకు వైద్యాధికారులు స్పందించారు. ఈ మేరకు ఫార్మాసిస్టు రాజేష్ దగ్గరుండి ఎలక్ట్రీషియన్‌తో వైర్లను సరి చేయించారు. దీంతో రోగులు కృతజ్ఞతలు తెలిపారు.

శనేశ్వరుడికి పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌కి చెందిన జేష్ట్యాదేవి సమేత శనైశ్వరాలయంలో జాతక రిత్యా గ్రహదోష నివారణ పూజలను ఆలయ ప్రధాన అర్చకులు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తిలతైల, జిల్లేడు పూలతో సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయంలో శివుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

తాడూరు: మండల కేంద్రంలో శనివారం వైస్ ఎంపీపీ శివలీల అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ గంగామోహన్, వైద్యాధికారి డా. సంతోష్‌అభిరామ్, సభ్యులు పరమేశ్వర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు



సన్మానిస్తున్న జర్నలిస్టులు

అచ్చంపేట రూరల్: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నియోజకవర్గంలోని అన్ని మండలాల జర్నలిస్టులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని మండలాల్లోని జర్నలిస్టుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, సీనియర్ పాత్రికేయుడు వీరబ్రహ్మంను సన్మానించారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి...

పట్టణంలోని ఏడో వార్డులో దివ్యాంగుల భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు భూమి పూజ చేశారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అనంతరం పట్టణంలోని లింగాల రోడ్డులో ఉన్న బస్తీ దవాఖానను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, వైస్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయసుధ

చారకొండ: ఉపాధి కూలీలకు ప్రభుత్వం కల్పించే వంద రోజుల ఉపాధి పనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని జేపల్లిలో శనివారం ఉపాధి పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. ఈ మేరకు కూలీలు చేసే పనితోపాటు జీపీ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నర్సరీని సందర్శించి వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీఓ వెంకటేష్, సర్పంచ్ రవీందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీలత తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

తాడూరు: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ గంగామోహన్ సూచించారు. శనివారం మండలంలోని గుంతకోడూరులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు. గ్రామంలో వందకు పైగా కూలీలు పాల్గొనే విధంగా చూడాలని ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్‌ను కోరారు. పనులపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే మండలంలో అన్ని గ్రామాల్లో కూలీలను పెంచేవిధంగా ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింగరావు

ఊర్కొండ: మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఓ నర్సింగరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ నర్సింగరావు మాట్లాడుతూ మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి కొత్త రుణాలను పొందాలన్నారు. మొండి బకాయిలు త్వరగా చెల్లించేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ రపభాకర్, మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు, వీఓఎలు, డీపీఎం ఎఫ్‌ఎస్ వెంకటేష్, డీపీఎం నర్సింహ, ఏపీఎం శేఖర్ ఉన్నారు.

బ్యాంకు అదాలత్‌లో 63 కేసుల పరిష్కారం



అదాలత్‌లో కేసులు విచారిస్తున్న మెజిస్ట్రేట్ ఆర్‌కే.వెంకటరమణ సుహాస్

కొల్లాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం బ్యాంకు అదాలత్ నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఆర్‌కే వెంకటరమణ సుహాస్ సమక్షంలో అదాలత్ జరిగింది. నియోజకవర్గంలోని యూనియన్ బ్యాంకుల పరిధిలో ఉన్న కేసులను కక్షిదారులు వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కారం చేసుకున్నారు. అదాలత్‌లో మొత్తం 63 కేసులు పరిష్కారమయ్యాయి. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద బ్యాంకులకు పెండింగ్ బకాయిలు రూ.9,10,862 వసూలు అయ్యాయి. అదాలత్‌లో న్యాయవాదులు ఆర్.కురుమూర్తి, మోహన్‌లాల్, కోర్టు సూపరింటెండెంట్ బోగా హరికృష్ణ, యూనియన్ బ్యాంకుల ఉద్యోగులు ఉన్నారు.

పశుమిత్రులను వర్కర్లుగా గుర్తించాలి



మాట్లాడుతున్న చైతన్య

నాగర్‌కర్నూల్‌రూరల్: 8 ఏళ్లుగా వెట్టి చాకిరికి గురవుతున్న పశుమిత్రులను వర్కర్లుగా గుర్తించాలని పశుమిత్రుల వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. అనంతరం డీఆర్‌డీఓ నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 8 ఏళ్ల క్రితం సెర్ప్ ఉద్యోగులుగా శిక్షణ ఇచ్చి పశువులకు వైద్యం చేయమని పంపించారని, ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్లు అందుకున్నా తాము గ్రామాలలో పశువులకు వైద్యం కొనసాగిస్తున్నామని అన్నారు. పశువైద్యానికి సంబంధించిన కిట్లు, ఎలక్ట్రికల్ స్కూటీలు ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకురాలు మంజుల, రాధ, శోభ, గీత, దీపిక, కృష్ణవేణి, యశోద, మంజూ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, నాయకులు అశోక్, రామయ్య పాల్గొన్నారు.

బోయలపల్లెకి ఆర్టీసీ బస్సు నడపాలి



ఆర్టీసీ డిపో వద్ద బోయలపల్లె గామస్తులతో సుధాకర్‌రావు

కొల్లాపూర్: మండలంలోని బోయలపల్లెకి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామ ప్రజలు శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బోయలపల్లె నుంచి పాదయాత్రగా వారు పట్టణానికి వచ్చారు. ఈ మేరకు ఆర్టీసీ డిపో గేటు వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. డిపో వద్దకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు చేరుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. త్వరలోనే బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడతామని అధికారులు చెప్పడంతో ఆందోన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు కాకి సత్యనారాయణగౌడ్, కాశీపురం మహేష్, బాలకృష్ణ యాదవ్, ఎల్లయ్యయాదవ్, శివకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.